## క్లుప్తంగా

### ఎంబీబీఎస్‌లో మూడు బంగారు పతకాలు



కుటుంబ సభ్యులతో మహబూబీ

బోనకల్: మండలంలోని మోటమర్రికి చెందిన నిరుపేద సుతారీ మేస్త్రీ షేక్ సోందు సాహెబ్ కుమార్తె షేక్ మహబూబీ హైదరాబాద్‌లోని ఆయాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఈసందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన ఆమె తాజాగా జరిగిన కార్యక్రమంలో ఎంబీబీఎస్ పట్టాతో పాటు మూడు బంగారు పతకాలు అందుకుంది. గ్రామంలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన తొలి విద్యార్థిని కావడంతో మహబూబీని పలువురు అభినందించారు.

### తుక్కుగూడ సభకు తరలిరండి



ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి/ఏన్కూరు: ఈ నెల 6న రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, యువజన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుగులోతు సర్దార్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తారని తెలిపారు. సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

### ముస్లింలకు తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందజేస్తున్న దృశ్యం

కారేపల్లి: కారేపల్లిలోని పేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా.. రంజాన్ తోఫాను శుక్రవారం వితరణగా అందజేశారు. కారేపల్లి జామే మసీదు మాజీ అధ్యక్షుడే గౌసుద్దీన్ సుమారు 100మంది ముస్లింలకు తోఫాను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానగుణం కలిగి ఉండాలని, అప్పుడే దేవుని దృష్టిలో ఆశీర్వదించబడుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు గౌసుద్దీన్, సాదిక్ అలీ, విశ్రాంత ఉపాధ్యాయులు ఎండీ బాబు, న్యాయవాది నసీరుద్దీన్, ఖలీలుల్లాఖాన్, చాంద్‌పాషా, అబ్జల్, మున్వర్, సద్దాం, ఖైరుద్దీన్, యాకూబ్, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### భూమిపూజ

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం సంతు సేవాలాల్-మేరమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తండా నాయకులు భుక్యా బాలాజీ, మూడ్ బాలాజీ, నునావత్ లక్ష్మణుడు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ స్వప్న, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాసరావు, నిర్మల, నాగేశ్వరరెడ్డి, రామారావు, వెంకట్రామిరెడ్డి, రమేష్, మురళీధర్, అంకిరెడ్డి ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ: విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపడుతున్నందున మాధాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్‌లో శనివారం ఉదయం 7:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ముదిగొండ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**అన్నారుగూడెం ఫీడర్‌లో..**

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావుపేట, లక్ష్మీనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**మర్లకుంట సబ్‌స్టేషన్ పరిధిలో..**

పెనుబల్లి: మండల పరిధిలోని మర్లకుంట విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున ఆ సబ్ స్టేషన్ పరిధిలోని ముత్తగూడెం, మర్లకుంట, కేఎం బంజర్, కారాయిగూడెం, గణేష్‌పాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ భుజేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# వామ్మో.. ఇవేం ఎండలు!

**ఉదయం 8 నుంచే ఎండ తీవ్రత**

- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- ఉష్ణోగ్రతలతో బెంబేలెత్తుతున్న జనం
- శీతల పానీయాలతో ఉపశమనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



సిరిపురంలో నిర్మానుష్యంగా ఉన్న రహదారులు

వైరారూరల్: ఇవేమి ఎండలు నాయనా.. ఈ మధ్య కాలంలో ఇంత ఎండలు ఎప్పుడు చూడలేదు.. అంటూ భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచే భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. దీంతో వడగాలులతో మండల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతేకాకుండా ఎండలు దంచికొడుతున్న సమయంలో ప్రజలు ఎటువంటి రక్షణ కవచాలు లేకుండా బయటకు వెళ్లేందుకు సంకోచిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ఉగ్రరూపాన్ని దాల్చుతున్నాడు. ఉష్ణోగ్రతలు అత్యధికంగా 40 డిగ్రీలు నమోదవుతుండడంతో ప్రజలు ఎండ తాకిడికి బెంబేలెత్తుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఎండలు మండుతూ వడగాలులు వీస్తుండడంతో ఒకవైపు కష్టజీవులు, మరోవైపు మూగజీవులు సైతం విలవిలలాడుతున్నాయి. అదే విధంగా ఉదయం సుమారు 11 గంటల సమయం నుంచే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

**వడదెబ్బ లక్షణాలు..**

వేడి అధికంగా ఉన్న చోట్లలో ఎక్కువగా కష్టపడి పని చేస్తున్నప్పుడు ప్రతి గంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమటరూపంలో మన శరీరం కోల్పోతుంది. శరీరం ఉప్పు కన్నా ఎక్కువ నీటిని కోల్పోతే వడదెబ్బ తగులుతుంది. నీటికంటే ఉప్పు శాతం చెమట ద్వారా పోతుంటే దాహం అంతగా ఉండదు. నీరు బాగా తాగి ఉప్పు మాత్రం సరైనంత తీసుకోకపోతే వడదెబ్బ ఎక్కువగా తగిలే అవకాశముంది. 50 నుంచి 65 సంవత్సరాలలు పైబడిన వారు.. పసిపిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు అనారోగ్యంతో బాధపడే వారు, గుండె జబ్బులు, అధిక రక్తపోటు ఉన్న వారికి వడదెబ్బలు తగిలే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

**ప్రథమ చికిత్స..**

వడదెబ్బ బారిన పడిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. అతని శరీరంపై ఉండే దుస్తులను తొలగించి చల్లని నీటితో కడగాలి. అదే విధంగా చల్లని నీటితో ముంచిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి. ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంతా రుద్దితే చాలా మంచిది. వడదెబ్బ తగిలిన వ్యక్తికి శరీరమంతా చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. రోగులను చల్లని నీరు లేదా ఉప్పు, ఇతర లవనాలను కలిపిన నీటిని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని తీరు తాగించకూడదు. ప్రథమ చికిత్స చేసి వెంటనే ఆస్పత్రికి తరలించాలి. స్పృహ కోల్పోతే వీలైనంతా త్వరగా వైద్యులను సంప్రదించాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- ఎక్కువగా మంచి నీరు, ద్రవ పదార్థాలు సేవించాలి.
- సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళలో ఎండలో తిరగకూడదు.
- బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా పళ్ల రసాలు తాగాలి. గొడుగును ఉపయోగించాలి.
- తెల్లని దుస్తులు, తలకు టోపీ, రుమాలు ధరించాలి. నల్లని దుస్తులను ఎటువంటి పరిస్థితిలో ధరించకూడదు.
- ఇంటి కిటికీలు, తలుపులకు తెరలు వాడాలి. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఉపయోగించుకోవాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు 20 నిమిషాలకోసారి ద్రవపదార్థాలను తీసుకుంటూ.. కుండలో నీటిని తాగడం చాలా మంచిది.
- ఆల్కహాల్ తాగడం వలన రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. కావున ఆల్కహాల్ తాగకుండా ఉంటే చాలా మంచిది.

**జాగ్రత్తలు పాటించాలి..**



ఎండలో ఎక్కువగా గడపకుండా చల్లని ప్రదేశాల్లో పనులు చేసుకోనేటట్లు చూసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స కోసం వైద్యులను సంప్రదించాలి. రోజుకు 5 లీటర్ల పైగా నీరు తాగితే వడదెబ్బ నుంచి రక్షించుకోవచ్చు. వడదెబ్బ తగిలిన వ్యక్తి వైద్యుల సలహాలు పాటించాలి. అత్యవసరమైతేనే తప్ప బయటకు రకూడదు.

– తమ్మినెట్టి ఉమామహేశ్వరరావు, ప్రైవేట్ వైద్యుడు

**అవగాహన కల్పించాలి..**



వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవవగాహన కల్పించాలి. ఏప్రిల్ మొదటి వారంలోనే భానుడు విశ్వరూపాన్ని చూపతున్నాడు. బయటకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమవుతున్నాము. గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలలో వైద్యాఆరోగ్యశాఖ అధికారులు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయాలి.

– సాగినేని నాగేశ్వరరావు, కేజీ సిరిపురం

# చలివేంద్రం ప్రారంభం



కొణిజర్ల: చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రోజారాణి, తదితరులు



చింతకాని: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రామయ్య

కొణిజర్ల/చింతకాని: వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున ప్రతీ పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీటిని అందించాలని ఎంపీడీఓలు ఏ.రోజారాణి, రామయ్య తెలిపారు. శుక్రవారం కొణిజర్ల, చింతకాని స్థానిక మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటి కొరత లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, యూడీసీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రూ.22 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్లు



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పిచ్చయ్య

కారేపల్లి: తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గేటు కారేపల్లి, రేగులగూడెం, సింగరేణి పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో రూ.22 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు పిచ్చయ్య – సత్యవతి దంపతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. ప్రజలకు కావాల్సిన వాటర్‌క్యాన్లను సైతం ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ తోటకూరి శ్రీనివాసరావు, సంతగుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, రైతుబంధు మాజీ మండల కన్వీనర్ హనుమకొండ రమేష్, మాజీ సర్పంచ్‌లు కల్పన, ఈసం అరుణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 200 రోజులు 'ఉపాధి' కల్పించాలి



సీతంపేటలో మాట్లాడుతున్న హనుమంతురావు

చింతకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200 రోజులు ఉపాధి కల్పించాలని సీపీఐ ఎంఎల్ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతురావు, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ కూలీలతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కూలీలకు రోజువారి వేతనం రూ.600లకు పెంచాలని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్, టెంట్లు ఉంచాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జీవనభృతి రూ.12 వేలు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నర్సయ్య, నాయకులు బాబు, జోజి, స్వరాజ్యం, పద్మ, యశోద, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

**'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం..**



మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ అన్నారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో జరిగిన ఉపాధిహామీ కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించి ఉపాధిహామీ పథకాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిపం కుమారి, కార్యదర్శిగా ఆకుల అనంతలక్ష్మి, ఉపాధ్యక్షులుగా మరియమ్మ, కారుమంచి మార్గని, వరలక్ష్మి, శ్యామల, రాధా, కార్యక్రమంలో మహిళా సమాఖ్య సత్తుపల్లి డివిజన్ నాయకులు రంజాన్‌బి, అపర్ణ, సుమలత, సువార్త, గౌరి, యశోధ, లక్ష్మి, రామారావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఆదివాసీ మహిళలపై దాడి సరికాదు



ప్రదర్శన నిర్వహిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

సత్తుపల్లిరూరల్: చంద్రాయపాలెం ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలని.. ఆదివాసీ మహిళలపై దాడుల చేయడాన్ని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) భద్రాద్రికొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమా ఖండించారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో శుక్రవారం దాడికి గురైన బాధిత కుటుంబాలను పీఓడబ్ల్యూ బృందం పరామర్శించింది. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంద్రాయపాలెం భూమి విషయంలో న్యాయం చేయాలని కోరిన మహిళలపై పోలీసులు దాడులు చేయడం సరికాదన్నారు. స్టేషన్‌లో ఉన్న వారిని చూడటానికి చంటి పిల్లలతో వచ్చిన మహిళలను మూడురోజులు స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారన్నారు. గ్రామాల నుంచి రోజు కొంత మందిని పిలిచి కేసులు నమోదు చేస్తున్నారని.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ ఘటనపై విచారణ చేసి.. ఆదివాసీ మహిళలకు న్యాయం చేయాలన్నారు. పట్టాలు ఉన్న వారికి భూములు తిరిగి ఇచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు సోమ వినోద, సరోజ, కాంతమ్మ, నాగలక్ష్మి, చంద్రమ్మ పాల్గొన్నారు.

### నియామకం

మధిర: మధిర ఏరియా (100పడకల) ఆస్పత్రికి సూపరింటెండెంట్‌ను నియమించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ అమర్‌సింగ్‌ను మధిర 100 పడకల ఆస్పత్రికి బదిలీ చేస్తూ శుక్రవారం వైద్య విధాన పరిషత్ ఆదేశాలు జారీ చేసింది. మధిర పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ పక్కన నూతనంగా నిర్మించిన ఏరియా ఆస్పత్రికి ఇక నుంచి ఆయన సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తారు. ఆస్పత్రి భవన నిర్మాణం త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉంది.

### దివ్యాంగుడికి లయన్స్‌క్లబ్ చేయూత



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలను కల్పించడానికి వైరా లయన్స్‌క్లబ్ ఎల్లప్పుడు ముందుంటుందని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు కొమిరిశెట్టి శ్రీధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సహకారంతో దివ్యాంగుడు ఎలగందుల కోటేశ్వరరావుకు ట్రైసైకిల్ అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనగొండ ఉపేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వనమా విశ్వేశ్వరరావు, ముళ్లపాటి సీతారాములు, కొమిరిశెట్టి శ్రీధర్, పుష్పావతి, కొల్లారాంబాబు, చింతోజు నాగేశ్వరరావు, మిట్టపల్లి సత్యంబాబు, రామారావు, రాము, రాంగోపాల్, సురేష్, చక్రవతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు చీరలు పంపిణీ

కల్లూరు: మండలంలోని ఎర్రబోయినపల్లిలో ప్రముఖ పారిశ్రామికవేత్త బీరవల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ రఘు తల్లి పుల్లమ్మ వర్ధంతి సందర్భంగా వితంతువులకు, వృద్ధులు, వికలాంగులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, కృష్ణయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శుక్రవారం అనారోగ్యంతో బెటాలియన్ పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందాడు. కోసూరి బ్రహ్మయ్య కేన్సర్‌తో మృతి చెందాడు. బ్రహ్మయ్య 6వ బెటాలియన్ చాతకొండ, కొత్తగూడెంలో పని చేస్తున్నాడు. ఈ మేరకు ఖర్చుల నిమిత్తం ఆర్ఐలు జీవీ రామారావు, పి.ఉదయ్‌కుమార్, ఆర్ఎల్ ఆర్ఎస్ఐ ఎం.శ్రీను మృత దేహాన్ని సందర్శించి రూ.20 వేలు అందజేశారు.

### నూతన దంపతులకు ఆశీర్వాదం



ఎర్రుపాలెం: ములుగుమాడులో వధూవరులను ఆశీర్వదిస్తున్న భట్టి విక్రమార్క

మధిరరూరల్/ఎర్రుపాలెం: మండలంలోని సిద్ధినేనిగూడెం గ్రామానికి చెందిన మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, సునీత దంపతుల కుమార్తె హారిక, విద్యాధర్ సాయి నూతన వధూవరులను మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఆశీర్వదించారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలంలోని ములుగుమాడు గ్రామంలో రేలచర్ల గోపి-లక్ష్మీ మహేశ్వరిల వివాహానికి భట్టి హాజరై ఆశీర్వదించారు. రామన్నపాలెంగ్రామంలో కాంగ్రెస్ నాయకుడు నాగిరెడ్డి మనవడి వివాహం ఇటీవల జరగగా.. ఆ దంపతులను కూడా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాగేశ్వరరావు, ఎంపీపీ లలిత తదితరులు పాల్గొన్నారు.

**తక్కెళ్లపాడులో.. దయాకర్‌రెడ్డి**

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమాని గంధసిరి సత్తయ్య కుమారుని వివాహానికి శుక్రవారం పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందించారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రాంబాబు, కోటేశ్వరరావు, అక్కిరెడ్డి, అప్పారావు తదితరులు ఉన్నారు.

# భూసార పరీక్షలపై అవగాహన



భూపరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

ముదిగొండ: రైతులు ఎక్కువ మోతాదులో నత్రజని వాడకం వలన భూమి సారవంతం తగ్గుతుందని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు వివరించారు. మండలపరిధిలోని మాధాపురంలో రైతులకు భూసార పరీక్షలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసార పరీక్ష వలన భూమి సారవంతం ఎంత మోతాదులో ఉందో తెలుసుకుని మట్టి పరీక్ష ఫలితాల ద్వారా భూమిలో ఏ ఎరువు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవచ్చన్నారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఏఈఓ దివ్యమనీషా, మాజీ సర్పంచ్ యరబోలు వేణుగోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# బోరింగ్‌కు మరమ్మతులు

కల్లూరురూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా బోర్ పంపులను రిపేర్ చేస్తున్నారు. కల్లూరు మండలంలో సుమారు 400 బోర్ పంపులు ఉండగా.. అందులో 72 పంపులు మరమ్మతులకు నోచుకోలేదు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తగా గ్రామాల్లో పాడైపోయిన బోర్లను రిపేర్ చేయించి నీటి సరఫరా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆదేశాలు ఇచ్చింది. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడనున్న దృష్ట్యా ప్రభుత్వం బోర్ పంపుల మరమ్మతుకు అనుమతి ఇవ్వగా.. బోర్ పంపులు రిపేరు చేయించి నీటి సరఫరా జరిగే విధంగా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. కల్లూరు మండలంలో కప్పలబంధంలో బోర్‌కు మరమ్మతులు చేశారు. మండలంలో ప్రస్తుతం ఒక బోరు మెకానిక్ పని చేస్తున్నారు. మరో బోర్ మెకానిక్‌ని నియమించాల్సిన అవసరం ఉంది.

# నిరంకుశ పాలనను అంతమొందించాలి



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వర్లు

వైరా: కేంద్రంలోని పీఎం మోదీ కొనసాగిస్తున్న నిరంకుశ, అరాచక పాలనను ప్రజలు అంతమొందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వైరా, వైరాటౌన్, కొణిజర్ల మండలాల వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, రైతు కూలీలు, ఉపాధి కార్మికులు, దళితులు, పేదలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం నూతన జీఓ ద్వారా రెండు పూటల పని కల్పించాలన్నారు. ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలు గ్రామ గ్రామాన జరపాలన్నారు. ఉపాధి సమస్యలపై ఈ నెల 21న ఖమ్మంలో జరిగే జిల్లాస్థాయి సదస్సుకు ఉపాధికూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకుల మేరుగు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, చింతపల్లి ప్రసాద్, బొలమాల యోహాన్, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, రెహనా, మజీద్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబూజగ్జీవన్‌రామ్

దేశ ఉపప్రధానిగా బాబూజగ్జీవన్‌రామ్ బడుగు, బలహీనవర్గాలకు ఎనలేని సేవలు అందించారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు, నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



వైరా: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సత్తుపల్లిరూరల్: 15వ బెటాలియన్‌లో.. నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ పి.వెంకట్‌రాములు



మధిర: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీఆర్టీయూ నాయకులు



ముదిగొండ: గోకినేపల్లిలో..



వైరారూరల్: సిరిపురంలో..



బోనకల్‌లో..



ఎర్రుపాలెంలో..